www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 ఏప్రిల్ 2023



పారదర్శకంగా కేసుల దర్యాప్తు : ఎస్పి

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పి

నెల్లూరు: పోలీస్ స్టేషన్లలో నమోదు అవుతున్న ప్రతి కేసును పారదర్శకతతో ప్రామాణికంగా తీసుకొని దర్యాప్తు చేయాలని సిబ్బందికి ఎస్పి కె.తిరుమలేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో నెల వారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా జిల్లాలో పోలీస్ స్టేషన్ వారిగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, విచారణ, సొత్తు రికవరీ వంటి అంశాలపై చర్చ కొనసాగింది. నేరాలకు ప్రధాన కారణమైన డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ వంటివాటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కట్టడి చేయగలిగితే నేరాలు తగ్గుముఖం పడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. 174, మర్డర్, మర్డర్ ఫర్ గెయిన్, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, అట్రాసిటీ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, నేర స్థలాన్ని తప్పక సందర్శించి, ప్రాథమిక ఆధారాలు సేకరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న కందుకూరు డిఎస్పిని సత్కరించి, మేమెంటో అందజేశారు.

రైతులకు నీళ్లు..కలాసీలకు క'నీళ్లు'..!

రాష్ట్ర ప్రభుత్వం అడిగినా.. అడగక పోయినా...ఇంటింటికి ఏదొక పథకం ఇస్తున్నామని చెబుతోంది. ఒక్కో కుటుంబానికి లక్షల రూపాయలు ప్రభుత్వం అందించిందని గొప్పలు పోతుంది. ప్రతి రోజూ కష్టపడి, రైతుల వ్యవసాయ సాగుకోసం రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్న కలాసీలకు మాత్రం ఏడాదిన్నర నుంచి ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ వేతనాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. రైతులకు నీళ్లు అందించే కలాసీలు కన్నీళ్లు పెడుతున్నారు. అధికారులు చుట్టూ తిరుగుతూ తమ గోడు వినిపిస్తున్నారు. చెబితే వినే ప్రజా ప్రతినిధులు లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది..

- ఒకటన్న సంవత్సరంగా వేతనాల్లేవ్
- ఏడాదికి రైతుల ఆదాలయ రూ.3,120 కోట్లు
- కలాసీల బకాయి రూ.3.27 కోట్లు
- ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కష్టపడి పనిచేసేవారికి వేతనాలు ఇవ్వడం లేదు. నెలంతా పనిచేసే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీ వేతనాలు ఇవ్వడం లేదు..వేతనాల కోసం రోడ్లపైకి రావాల్సిన దుస్థితి వస్తుంది..మరోవైపు వివిధ పథకాల పేరుతో ప్రజలకు లక్షల కోట్లు అందిస్తున్నామని గొప్పలు చెబుతోంది. ఇరిగేషన్ శాఖలో నీటి నిర్వహణ కోసం ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ద్వార 223 మంది కలాసీలను నియమించింది. ఇరిగేషన్ శాఖలో ఎఇ, డిఇలతో పాటు ఇతర ఉద్యోగుల భర్తీ ఎప్పుడో నిలిచిపోయింది. రిటైర్డ్ అయినప్పటికీ భర్తీ చేయడం లేదు. కొత్త ఉద్యోగాలు రావడం లేదు. జిల్లాలో సాగునీటి కాలువల ద్వార వ్యవసాయం సాగుతోంది. సోమశిల, కండలేరు, కలిగిరి, సర్వేపల్లి, అల్లూరు అనేక చెరువులు, ప్రాజెక్టుల కింద భారీగా వ్యవసాయం చేస్తున్నారు. తొలి పంటకు నీరు సంమృద్ధిగా ఉంటున్నా, రెండో పంటకు నీటి నిర్వహణ ద్వార పంట సాగుచేస్తున్నారు. ఇరిగేషన్ కాలువపై ఎఇ, డిఇలు తిరిగి ఏయే కాలువల కింద ఎంత నీరు విడుదల చేయాలనే విషయాలను చూసుకోవాలి, అధికారులు లేకపోవడంతో కలాసీల ద్వారనే ఈ పనులు చేయిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కాలువపై తిరుగుతూ గేట్లు తీసి, కాలువకు నీరు వదలడం, మళ్లీ కట్టివేయడం చేస్తున్నారు. ఇంత కష్టపడుతున్నా వీరి కష్టాన్ని ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. నెలంతా పనిచేసినా వేతనాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు.

కలాసీల క'నీళ్లు'..!

ఇరిగేషన్ శాఖలో కాలువల నిర్వహణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో కలాసీలను నియమించారు. ప్రతి నెల వారికి రూ.10,500 వేతనంగా ఇస్తున్నారు. రోజుకు రూ.350 మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు , ఇతర పనులు చేసేవారికి రూ.500 నుంచి రూ.800 వరకు వస్తుంది. ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం కావడంతో అదేదో గొప్ప పనిగా భావించిన కలాసీలు పనిచేస్తున్నారు. ఒకటిన్నరేడాది నుంచి వీరికి రావాల్సి జీతాలు ఇవ్వడం లేదు. ఇరిగేషన్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలసిపో తున్నారు. మా జీతాలు ఇవ్వండి సార్ అంటూ తిరుగుతూనే ఉన్నారు. జిల్లాలో ప్రాజెక్టులు, కాలువ ద్వార ప్రతేడాది 8 లక్షల ఎకరాల్లో పంటసాగుచేస్తున్నారు. ఈ పంటను నీరు విడుదల చేసేది అంతా కలాసీలే కావడం గమనార్హం. ఎకరానికి మూడు పుట్లు లెక్కన ఏడాది సుమారు 24 లక్షల పుట్లు దిగుబడి వస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం పుట్టి కనీసం రూ.13 వేలు చొప్పున అమ్ముకున్నా రైతులకు వస్తున్న ఆదాయం రూ.3120 కోట్లు. ఇందులో దళారులు, వ్యాపారులు మిం గేసినా కనీసం రూ.2500 కోట్ల వరకు ప్రతేడాది వరి ద్వార ఆదాయం వస్తుంది. ఇంత పనిచేస్తున్నా కలాసీలకు వేతనాలు ఇవ్వడానికి మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. ఒక్కో కలాసీకి నెలకి రూ. 10,500 వేతనం చొప్పున ఒకొక్కరికి రూ.1.47 లక్షలు వేతనాలు బకాయిలున్నాయి. 223 మందికి సుమారు రూ.3.27 కోట్లు బకాయిలు న్నాయి. దీనిని ఇప్పించాలని కలాసీలు ఇరిగేషన్ అధికారులు చుట్టూ తిరుగుతు న్నారు. అధికారులు జీతాల కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తే, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. రైతుల నుంచి నీటితీరువా సెస్ వసూళ్లు చేస్తేనే జీతాలు ఇస్తామని మెలికపెడుతోంది. కాలువ మరమ్మతులు, నీటి నిర్వహణ లోపం కారణంగా ప్రభుత్వానికి రైతులు సెస్ ఇవ్వడంలో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సాకు చూపించి కలాసీల కన్నీళ్లకు ప్రభుత్వం కారణమవుతుంది. ప్రభుత్వంలో ఉద్యోగం కావడంతో వదలలేక, మరో పనికి వెళ్లలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. " ఏడాదన్నర నుంచి జీతాలు లేకుండా పనిచేస్తున్నాం, భార్య, పిల్లలు పస్తులుంటున్నారు. అందరికీ పథకాలు ఇస్తున్నా మని చెప్పే ప్రభుత్వం కష్టపడి పనిచేసిన మా జీతాలు ఇవ్వడానికి ఏం. " అంటూ కలాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా బయటొస్తే తీసేస్తారేమోననే భయంతో వణికిపోతున్నారు. తమ నేతలకు ఎవరికైనా చెప్పుకుందామంటే వినే ప్రజా ప్రతినిధి ఎవరూ కనిపించడం లేదు. రైతులకు సాగు నీరిస్తూ, కలసీలు కన్నీళ్లు దిగమిం గుతున్నారు. ప్రభుత్వం ఏం చేస్తుందో చూద్దాం..

పరామర్శిస్తున్న నాయకులు

గాయపడ్డ జెన్కో కార్మికులకు

మెరుగైన వైద్యమందించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు నెల్లూరు జిల్లా నేలటూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంట్ లో 27/ 4 /23న 11 గంటల ప్రాంతంలో మూడవ యూనిట్లో సిసి ఆర్ బ్రేకర్ ప్యానల్ వద్ద జరిగిన ప్రమాదంలో జెన్కో కార్మికులు కల్యారి కార్తీక్, సురేష్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారని వారికి మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సిఐటియు నెల్లూరు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, జెన్కో ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు కె.నాగరాజు సిఐటియు మండల కార్యదర్శి గోడ భాస్కర్ లతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏపీ జెన్కోలో ఇటువంటి ప్రమాదాలు సర్వసాధారణమైపోయాయని, భద్రతాపరమైన చర్యలు చేపట్టే దాంట్లో అలసత్వంగా వ్యవహరిస్తున్నారన్నారు. లాభాలే పరమావధిగా భావించి కాంట్రాక్టర్లు సరైన సేఫ్టీ సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి బాధ్యుల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లబ్ధిదారులకు సూచనలు

ప్రజాశక్తి -కందుకూరు: పరాల సాయి నగర్ లేఔట్లో ఇళ్ల లబ్ధిదారులతో గురువారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. పేమెంట్ వేసుకున్న లబ్ధిదారులందరూ త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు.ప్రభుత్వం నుంచి వచ్చే సహాయ సహకారాలు గురించి ఈ సందర్భంగా వివరించారు. మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఈఈ, డిఇ, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ ప్రయోగ శాల ప్రారంభం

మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : రైతులకు మెరుగైన సేవలందించేందుకు రాష్ట్రంలోని అన్ని గ్రామీణ నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రంలో 147 వ్యవసాయ ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్‌డిఒ కార్యాలయ ప్రాంగణంలో రూ. 2.40 కోట్లతో నూతనంగా నిర్మించిన జీవన, సేంద్రియ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాలను జాయింట్ కలెక్టర్ శ్రీ కూర్మనాథ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిసారిగా నెల్లూరులో ఈ ప్రయోగశాలను నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే అన్ని గ్రామీణ నియోజ కవర్గాల్లో ఈ ప్రయోగశాలలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి అన్నదాతకు అన్ని విధాల అండగా ఉంటున్నారన్నారు. అనంతరం ప్రయోగశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రాజు, డీడీలు శివన్నారాయణ, సత్యవాణి, ఏడీలు నరసోజిరావు, శ్రీనివాసులు, కన్నయ్య, ల్యాబ్ ఇంచార్జ్ సుమలత ఉన్నారు.

దొరసానమ్మకు కన్నీటి వీడ్కోలు

భారీగా తరలివచ్చిన అభిమానులు

దొరసానమ్మ అంతిమయాత్ర దృశ్యం

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ప్రజా వైద్యశాల నిర్వాహకురాలు డాక్టర్ వింజం దొరసానమ్మ గైనకాలజిస్ట్(62) గురువారం తెల్లవారుజామున 4 గంటలకు తుది శ్వాస విడిచారు . ఉదయం నుండి సందర్శకుల తాకిడి మొదలైంది ఆమె పార్థివ దేహానికి ప్రముఖులు సంద ర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆత్మకూరు వెంకటేశ్వర ప్రజా వైద్యశాలలో ప్రజలకు విశిష్ట సేవలు అందించిన దొరసానమ్మ మతి పట్టణ వాసులను కలసి వేసింది. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి భారీ ఎత్తున అభిమానులు తరలివచ్చి ఆమెకు వీడ్కోలు పలికారు ఆత్మకూరులో తొలి మహిళా వైద్యురాలుగా వైద్య రంగంలో 30 సంవత్సరాలు సుదీర్ఘ సేవలు అందించడంతో ఈ ప్రాంత ప్రజలలో అనుబంధం పెంచు కుంది. దీంతో స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పట్టణం లోని వెంకటేశ్వర ప్రజా వైద్యశాల కు వచ్చి దొరసానమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు , డాక్టర్ ప్రణీత్ లను పరామర్శిం చారు. ఆమె అంతిమయాత్ర లోపెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని వీడ్కోలు పలికారు. ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు , మాజీ జెడ్పి చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేందర్ రెడ్డి , టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గూటూరి మురళి కన్నబాబు , వైసిపి నాయకులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి , డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య , నాగులపాటి ప్రతాప్ రెడ్డి , నోటికి వినయ్ కుమార్ రెడ్డి , టిడిపి నేతలుచంద్రా వెంకటసుబ్బ నాయుడు , కేత విజయభాస్కర్ రెడ్డి , పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు , సిపిఎం పార్టీ నాయకులు ఆత్మకూరు నాగయ్య షేక్ సందాని పాల్గొన్నారు

పోలీసుల అదుపులో సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు సబ్ రిజిస్ట్రార్ సుల్తాన్ బాషాను ఏసీబీ అధికారులు గురువారం అదుపులోకి తీసుకొని నెల్లూరు తరలించారు. గత రెండు రోజులుగా కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి తనిఖీలు చేస్తున్న విషయం తెలిసిందే. కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పై అవినీతి ఆరోపణలు పెద్ద ఎత్తున రావడంతో ఎసిబి అధికారులు రెండు రోజులు పాటు తనిఖీలు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లేకపోయినప్పటికీ ఆయన టేబుల్ లో రూ. 40 వేలలు డబ్బులు ఉండటంతో పాటు కొంత డబ్బు ఫోన్ పే ద్వారా కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ వ్యక్తి దగ్గర రూ. 90 వేలు నగదు దొరికింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ సుల్తాన్ బాషాను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించడానికి నెల్లూరు తరలిస్తున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు.

ఇంటర్ ఫలితాలలో

'కృష్ణ చైతన్య' విజయకేతనం

ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్: ఈనెల 26న విడుదలైన ఇంటర్ -2023 ఫలితాలలో కృష్ణ చైతన్య కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించారని ఆ కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ , సీనియర్ ఇంటర్ ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. జూనియర్ ఎంపిసి విభాగంలో సనా ఫాతిమా 470 మార్కులకు గానూ 465 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు. నిఖిల 463 మార్కులు, ధరనీష్ 462 మార్కులు సాధించారన్నారు. 460 మార్కులు పైన 10 మంది, 450 మార్కులు పైన 42 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. సీనియర్ ఎంపిసి విభాగంలో సువర్ణ 1000 మార్కులకు గానూ 987 మార్కులు సాధించి టాపర్ గా నిలిచిందన్నారు. దేవిసాయి సుష్మిత 986 మార్కులు, ఖాదర్ మస్తాన్, కతిక 985 మార్కులు, మానస 984 మార్కులు సాధించారన్నారు. 980 మార్కులకు పైన 11 మంది విద్యార్థులు, 970 మార్కులకు పైన 51 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో కష్ణ చైతన్య విద్యార్థులు రాష్ట్రస్థాయిలో టాపర్స్‌గా నిలిచి అద్భుత ప్రతిభ కనబరుస్తుండటం సంతోషకరంగా ఉందని డైరెక్టర్లు ఆర్ వి కష్ణారెడ్డి ,పి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు అధ్యాపకులను, అడ్మిన్ సిబ్బందిని వారు అభినందించారు. విద్యార్థులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పటిష్టమైన విద్యా ప్రణాళిక. అనుభవజ్ఞులైన అధ్యాపక బందం, ఒత్తిడిలోని విద్య విధానంతో ఈ ఫలితాలు సాధించలిగామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాణా ప్రమోద్ రెడ్డి జూనియర్ కళాశాల డీన్ సురేష్ బాబు, అకాడమిక్ డీన్ రాంగోపాల్ రెడ్డి, అడ్మిన్ పాయసం రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సుస్థిర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

తోటపల్లిగూడూరు : సుస్థిర అభివద్ధి లక్ష్యాలు సాధన సర్వే ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని ఇందుకూరుపేట ప్రాజెక్టు సిడిపిఒ హేన సుజన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్ క్రాంతి పథం కార్యాలయంలో సుస్థిర అభివద్ధి లక్షాల (ఎస్. డి.జి) సర్వేపై సూపర్ వైజర్లు కె. విజయలక్ష్మి, ఏ. సుబ్బమ్మ, జి. సునీతలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హేన సుజన్ మాట్లాడుతూ నవరత్నాలతో లింక్ అయిన ఇండికేటర్స్ డేటా ఎస్ డి జీ వెబ్ సైట్ లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. సచివాలయాల ఎం.ఎస్.కెలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

వెంకటాచలం : ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరం 34.44 శాతం సెకండ్ ఇయర్‌లో 30 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 90 మందికి 30 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 111 మంది విద్యార్థులకు 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదట సంవత్సరం కీర్తన 430 మార్కులు , ద్వితీయ సంవత్సరం శిరీష 875 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. మంచి మార్కులు సాధించినవారిని, సిబ్బందిని కళాశాల ప్రిన్సిపాల్ దీన దయాల్ అభినందనలు తెలిపారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి : టిడిపి

నెల్లూరు : కోట్టమిట్ట వద్దనున్న షాదీ మంజిల్ బుకింగ్ వ్యవహారంలో చోటు చేసుకుంటున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ విజిలెన్స్ డిఎస్‌పిని టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు కలిసి కోరారు. గురువారం టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్ నాయకుల ఆధ్వర్యంలో నెల్లూరు విజిలెన్స్ డిపార్ట్మెంట్ డిఎస్పీకి వినతిపత్రం అందజేశారు. కార్యరకమంలో నాయకులు హయాత్ బాబా న్యమత్ ఇక్బాల్ సుభాన్ సత్తార్ మైజుల్లా హుసేని సమీర్ అలీ రబ్బానీ పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం..!

కొనసాగుతున్న వామపక్షాల ప్రచార భేరి

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

నిరంకుశ మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపి దేశాన్ని కాపాడుకుందాం అంటూ నగరంలో నిర్వహిస్తున్న ప్రచార భేరీ సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో సాగింది. గురువారం 31వ డివిజన్ ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కిన్నెర కుమార్, కొండ ప్రసాద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంబాని, ఆదానీలకు అనుకూలంగా ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్ ,రైల్వే ఎల్‌ఐసి వంటి రంగాలను ప్రయివేటీకరణ చేయడానికి కేంద్రం సిద్ధమైందని విమర్శిం చారు. ఎన్నికల్లో నిరు ద్యోగ సమస్యను రూపు మాపేందుకు ఏడాదికి కోటి ఉద్యోగా వకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను గాలి కొది లేశారన్నారు. పెట్రోల్ , గ్యాస్ ధరలను పెంచి నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలు వచ్చేవిధంగా నిర్ణయాలు తీసుకుంటూ సామాన్యుడిపై పెను భారాలు మోపు తున్నార న్నారు. సిపిఎం నాయకులు ఎం. సుధాకర్, కె. సాంసన్, వెంకీ, మౌలాలి ముఠా కార్మికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రామకోటయ్యనగర్‌లో...

31. డివిజన్. రామకోటయ్య నగర్ లో ప్రచారం వామపక్షాల ప్రచార భేరి జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కొండా ప్రసాద్ మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం తీవ్ర ప్రమాదంలో పడిందన్నారు. సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు బి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అంబాని, ఆదానిలకు కారు చౌకగా కట్టబెట్టడం దారుణమన్నారు. సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు ఎస్.కె ఖలీల్. ఎస్కె రహీం. సుబ్రహ్మణ్యం. ఎస్.కె మున్వర్. షఫీ, ఎస్కె భాష. రాజా. సెల్వి. సిఐటియు నాయకులు ఉన్నారు.

నైపుణ్యంతో ఉన్నత అవకాశాలు

'ప్రకాశం' ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య

ప్రజాశక్తి -కందుకూరు

పోటీ ప్రపంచంలో నైపుణ్యాలే ఉన్నత అవకాశాలకు కీలకంగా మారతాయని, అది విద్యార్థులు గుర్తించాలని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. ఫైనలియర్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఇసిఇ) విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న అంశంలో నైపుణ్యాలను పెంచుకుని బంగారు భవితకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఎంబేడెడ్, మైక్రో ప్రాసెసర్, చీప్ డిజైనింగ్ తదితర అంశాలపై ప్రయోగాత్మక విద్యను ఉచితంగా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య రామయ్య భరోసా ఇచ్చారు. టెక్నికల్ డైరెక్టర్ కె. విజయ్ శ్రీనివాస్, ప్లేస్మెంట్ ఆఫీసర్ బ్రహ్మయ్యలను కలిసి సహాయం పొందవచ్చునని తెలిపారు.

'ప్రకాశం' విజయ రహస్యం

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల రెండు దశాబ్దాల కాలంలో సాధించిన విజ యాలకు మూలం అంకితభావం కలిగిన అధ్యాపకులు, విద్యార్థుల క్రమశిక్షణ, 24/7 యాజమాన్యం కృషిగా రామయ్య పేర్కొన్నారు. ప్రకాశంలో చేరే విద్యార్థులు అధిక శాతం క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తుండగా, అధ్యాపకులు సైతం కాలేజీ సంప్రదాయానికి అనుగుణంగా అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ప్రశంసలు అందుకుంటూ ఉండటం ఒక ప్రత్యేకతగా అని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యాలను పెంచేందుకు ప్రయోగశాలల ఆధునీకరణకు యాజమాన్యం చేస్తున్న వ్యయం గణనీ యమ న్నారు. ఐటి హెచ్‌ఒడి కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మౌలిక వసతుల కల్పనలో రాజీలేని ధోరణి "ప్రకాశం" యాజమాన్యం చూపుతుం దన్నారు. సిఎస్‌ఇ హెచ్‌ఒడి ఎంఎం రాయుడు, సివిల్ శర్మ, మెకానికల్ హెచ్‌ఒడి పున్నారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు కరస్పాండెంట్ కంచర్ల రామయ్యను సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న కంచర్ల రామయ్య

ఘనంగా దత్తాత్రేయస్వామి ఆరాధన

ప్రజాశక్తి - లింగసముద్రం : దత్తాత్రేయ స్వామి ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. మూడు రోజులు పాటు జరిగిన ఈ ఆరాధన మహోత్సవానికి యాత్రికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేశారు. గురువారం తెల్లవారు జామునుంచి యాత్రికుల కోలా హలంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. 41 రోజులు పాటు మండల పూజ, మాలధారణ, అర్ధ మండల పూజ, మాలధారణ దీక్షలు చేపట్టిన భక్తులు, వారి బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ ఏర్పాట్లు చేశారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. దీక్షలు చేపట్టిన వారు చేపట్టి పొంగళ్లు పెట్టారు. కందుకూరు, కావలి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. మొగిలిచర్ల యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గుడ్లూరు సిఐ సుబ్బారావు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. . లింగసముద్రం ఎస్ఐ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్ఐలు, 50మంది సిబ్బందితో బందోబస్తను పర్యవేక్షించారు.



మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి ఆలయం

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - లింగసముద్రం : మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి ఆరాధనకు వచ్చిన భక్తులకు కందుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో మజ్జిగ,మంచినీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. గురువారం మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులకు ప్యాకెట్లును అందజేశారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి,పల్లపోతు వెంగళరావు,కిలారి వెంకటేశ్వర్లు,మహేష్ ఉన్నారు.

'గుజ్జల'కు ఘన నివాళి

ప్రజాశక్తి -కందుకూరు : సిపిఐ అగ్రనాయకులు గుజ్జుల ఎల్లమందారెడ్డి పోరాట చరిత్ర ఘనీయమైనదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య పేర్కొన్నారు. గుజ్జుల ఎల్లమందారెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రావుల వెంకయ్య మాట్లాడారు. ఎలమందారెడ్డి జీవితమంతా పోరాటాలు చేశారన్నారు. కనిగిరి తాలూకాలో వెనుక బడ్డ ప్రాంతంలో జన్మించిన ఆయన కమ్యూనిస్టు పార్టీలో అంచలంచలుగా ఎదిగి జాతీయ నేతగా కొనసాగారన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు సహాయ కార్య దర్శి పి బాలకోటయ్య, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనంద్ మోహన్ సిపిఐ నాయకులు డి ఆదినారాయణ, ఎం లక్ష్మీనారాయణ, ఎస్ రామారావు, వై కొండయ్య ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-నెల్లూరు : ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనుపరచిన మున్సిపల్ జూనియర్ కళాశాలల విద్యార్థులను కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ అభినందించారు. గురువారం నగరంలోని మున్సిపల్ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి, బైపిసి విభాగంల్లో ఎస్‌కె హమీదా పర్వీన్ 981,ఎస్‌కె షిరిన్ 979, ఎస్‌కె సాదియా 975, ఆర్ .త్రివిక్రమ్ 960, ఎం.మానస్‌కుమార్ 955 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి విభాగాల్లో ఎస్‌కె హుస్నాతబుసం 436, ఎస్‌కె నూర్‌ఫాతిమా 432, ఎస్‌కె సుమయ 429, ఎస్‌కె మిస్వామహిన్ 421, కె.జోయల్ సునాద్ 419, ఎస్‌కె మదిహా 419, వి.దీక్షిత 419 సాధించారు. వారిని ఆయన అభనందించారు.

గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : జగనన్న కాలనీ లేఅవుట్లలో నిర్మాణ పనులను వేగవంతం చేసి, పూర్తి చేసిన గహాలను త్వరితగతిన లబ్ధిదారులకు అందించాలని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ లోని కమిషనర్ కార్యాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నిర్దేశించిన యాక్షన్ ప్లాన్ ను అధికారులంతా పటిష్టంగా అమలు చేస్తే లక్ష్యాలను సాధించగలమని తెలిపారు. మెప్మా విభాగం అధికారులతో సమన్వయం చేసుకుంటూ, లబ్ధిదారుల రుణాల మంజూరు ప్రక్రియకు ప్రత్యేక మేళాలు నిర్వహించాలన్నారు. హౌసింగ్ ఈ.ఈ నాగరాజు, డిఇలు శ్రీహరి గోపాల్, దయాకర్, ఏ.ఈ లు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-నెల్లూరు: ఆధునిక యుగంలో పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సాంకేతికతను టిడిపి కార్యకర్తలు అందిపుచ్చుకోవాలని టిడిపి నగర ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఐటిడిపి (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఐటీడీపీ జిల్లా ప్రెసిడెంట్ రసూల్, సిటీ అధ్యక్షులు సుధాకర్ రాజు, నగర అధ్యక్షుడు మామిడాల మధుతోపాటు.. మాజీ కార్పొరేటర్లు పీట్టి సత్య నాగేశ్వర్ రావ్, కువ్వారపు బాలాజీ, కప్పిర శ్రీనివాసులు , మల్లికార్జున్, జాఫర్ షరీఫ్, జహీర్ ఉన్నారు.

వివాహితపై అఘాయిత్యం కేసులో

నిందితుడికి ఐదేళ్లు జైలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఓ వివాహితపై అఘాయిత్యం, ఆపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడికి కోర్టు ఐదేళ్ల కఠిన శిక్షతో పాటు రూ. 1700 జరిమానా విధించింది. ఎస్ఐ కె. ఇంద్రసేనా రెడ్డి గురువారం తెలిపిన మేరకు వివరాలు ఇలా వున్నాయి. మండలం పాత కోడూరు దళితవాడకు చెందిన వివాహిత (అంగన్వాడీ కార్యకర్త) రాత్రి ఇంట్లో ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన కొత్త పున్నూరు వెంకటేశ్వర్లు 2017 నవంబర్ 27న ఇంట్లోకి ప్రవేశించి అఘాయి త్యానికి యత్నించాడు. ప్రతిఘటించిన వివాహితపై నిందితుడు దాడి చేసి హత్య చేసేందుకు యత్నించాడు. దీంతో బెదిరిపోయిన బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు వెంకటేశ్వర్లు పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శివకష్ణారెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడు వెంకటేశ్వర్లుపై పోలీసులు పెట్టిన కేసు రుజువు కావడంతో కేసును విచారిం చిన 8వ జిల్లా సెసెన్స్ అదనపు న్యాయమూర్తి సుమ గోపిరెడ్డి గురువారం నేరస్తునికి ఐదేళ్ల కఠిన శిక్షతో పాటు రూ. 1700 జరిమానా విధించారు. బాధితురాలి తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదు ప్రసాద్ వాదించారు. ఈ కేసులో నేరస్తునికి శిక్ష పడేలా కేసును వాదించిన పి.పీ సాదు ప్రసాద్, దర్యాప్తు చేసిన ఎస్ఐలు శివకష్ణారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ వి. శ్రీనివాస రావు (పీసి 1149)లను ఎస్పీ అభినందించారు.

బిజెపిని సాగనంపుదాం..దేశాన్ని కాపాడుకుందాం..

ప్రజాశక్తి-అల్లూరు: కేంద్రంలో నిరంకుశంగా పరిపాలన సాగిస్తున్న నరేంద్ర మోడీని గద్దె దింపి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు తుళ్లూరు గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల కేంద్రంలో ప్రచార భేరి శంఖారావం పూరించి కేంద్రంలో బిజెపి చేస్తున్న దుర్మార్గాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడా అంటూ మోడీని నిలదీశారు. కార్మికులను దెబ్బతీసేందుకు విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం సరికాదన్నారు. నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తానని ప్రగల్భాలు పలికి ఈ దేశంలో ఉన్న సంపదను స్విస్ బ్యాంకులలో దాచి ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మే డే సందర్భంగా ఏబీఎం కాంపౌండ్ నుంచి నర్తకి సెంటర్ వరకు భారీ ర్యాలీ చేపట్టి బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు షేక్ అబ్దుల్ రషీద్, ఎరబోలు రవీంద్రారెడ్డి, వాసా రఘురామిరెడ్డి, రాజయ్య, నేతగాని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

మర్రిపాడు: ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని తరిమికొట్టి దేశాన్ని కాపాడుకుందాం అని ప్రజా సంఘాల నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాలెంపాటి వెంగయ్య పాల్గొని మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. మోడీ అమిత్షాల నాయకత్వంలో కలిసి మెలిసి ఉండవలసిన ప్రజల మధ్య విద్వేషపు చిచ్చులు రాజేస్తుందని విమర్శించారు. అదాని అంబానీ లాంటి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని, ప్రశ్నించే ప్రతి ఒక్కరిని అణచి వేస్తున్నారన్నారు. దేశ స్వాతంత్ర్యాన్ని రాజ్యాంగ విలువలను కాపాడుకుందాం, కేంద్రం మద్దతుతో రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ కె రహంతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి రత్తయ్య, సీనియర్ నాయకులు సూర్యనారాయణ, గంగినేని నారాయణ, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పోలయ్య, మహమ్మద్ పాల్గొన్నారు.

మర్రిపాడులో ప్రచారం చేస్తున్న నాయకులు

కొడవలూరు: మండలంలోని నార్నూరాజుపాళెంలో ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని తరిమికొట్టి దేశాన్ని కాపాడుకుందాం అని ప్రజా సంఘాల నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొనె దయాకర్, దేవానంద్, తతారి నరసింహ, సుకుమార్, మధన్, తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రజాశక్తి-కావలి: వేసవిలో సంభవించే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు విపత్తు నిర్వహణలో శిక్షణ పొందిన వాలంటీర్లను సంసిద్ధం చేసినట్లు రెడ్ క్రాస్ డివిజన్ అధ్యక్షులు, రెవెన్యూ డివిజన్ అధికారి ఎ. కె. శీనానాయక్ పేర్కొన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయం వద్ద కావలి రెడ్ క్రాస్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ, ఇటీవ ప్రకృతివైపరీత్యాల పోలిస్తే, వేసవికాలంలో సంభవించే మరణాలు ఎక్కువ అని అన్నారు. వేసవిసెలవులలో తమ పర్యవేక్షణ లేకుండా సముద్రతీరానికివెళ్లడం, చెరువులు, గుంటలలో ఈత కొట్టేందుకు తల్లిదండ్రులు పిల్లలను అనుమతించకూడదని వివరించారు. అగ్నిమాపక దళాలకు తమ రెడ్ క్రాస్ వాలంటీర్లు చేదోడుగా ఉంటారని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ జిల్లా ఇన్చార్జి చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ, ఆర్డీఓ శీనానాయక్ సూచనల మేరకు పట్టణంలో ఇప్పటికే రెండు చలివేంద్రాలు ప్రారంభించామన్నారు. తమ ఇంటిలోని శుభకార్యాలు, పుట్టినరోజుల సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ, నిర్జలీకరణ కారణంగా వడదెబ్బ మరణాలు సంభవిస్తాయని, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు వీధుల్లో తిరుగకూడదని, అత్యవసరమైతే గొడుగు లేదా టోపీ ధరించి మాత్రమే బయటకు రావాలని అన్నారు. మంచినీరు అధికంగా సేవించాలని, మంచినీటిసీసాను వెంటతెచ్చు కోవాలని తెలిపారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, కార్యదర్శి గంధం ప్రసన్నఆంజనేయులు, కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, సభ్యులు ఒరుగంటివెంకటేశ్వర్లు, మొగిలిశెట్టి జమున, బిఎస్ ప్రసాద్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంజీవని బస్సు ప్రారంభం

ప్రజాశక్తి-ఉదయగిరి: నియోజకవర్గంలోని అన్ని గ్రామ పడకు వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటుగా ఉచితంగా మందులు పంపిణీతో కూడిన వైద్య సేవలందించుటకు మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదినం నాడు లాంఛనంగా ప్రారంభించారు. ఆరోగ్య సంజీవని బస్ ను వైద్య సేవలు మండలంలోని కర్ర సురేష్ స్వగ్రామమైన ఎర్రబల్లి పల్లె నుంచి తెలిసిరాళ్ల కొండరాయస్వామి ఆలయం వద్ద గురువారం పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో కర్ర సురేష్ మాట్లాడుతూ సంజీవని ఆరోగ్య రథంలో 200 కు పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఇసిజి పరీక్షలు చేయగల సామర్థ్యం తో పాటు నెబ్యులైజర్, ఆక్సిజన్ సిలిండర్ వంటి సదుపాయాలు, వైద్య నిపుణుడు డాక్టర్, నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, వాలంటీర్లు ఉంటారని తెలిపారు. త్వరలో ఉదయగిరి నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో వైద్య సేవలు ప్రారంభం చనున్నట్లు తెలియజేశారు. అనంతరం నియోజక రైతులకు పవర్ స్ప్రేయర్లు గ్రామానికి రెండు చెప్పున పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అన్నదాతలకు ఉపకరణాలు, వైద్య శిబిరాలు, యువతకు క్రీడా పోటీల నిర్వహణ, ఉచిత వైజ్ఞానిక శిక్షణ కోర్సులు, మహిళలకు సంక్రాంతి రంగవల్లులు, నిరుపేద వర్గకుల జీవనోపాధికి ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ అందజేశామన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ తెలుగు దేశం నాయకులు దుద్దుకూరు వెంకట రత్నం, సంధిరెడ్డి మాలకొండయ్య, చంద్ర ఉమా ఉమామహేశ్వరరావు, నాదెళ్ల రంగనాయకులు, రాయవరపు మాల కొండారావు, ఎర్రగుంట్ల చెన్న కృష్ణయ్య, నాదెళ్ల రంగారావు, రావెళ్ల మల్లికార్జున గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి-బిట్రగుంట: కప్పరాళ్ల తిప్ప గ్రామంలో 10 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్నామని వైసిపి బోగోలు మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ బోగోలు గ్రామపంచాయతీ కప్పరాళ్ల తిప్పలో గ్రామంలో 10 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన గతంలో శిలాఫలకానికి పరిమితమైన అభివృద్ధి, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సహకారంతో బోగోలు మండలంలో సుమారుగా రెండు కోట్ల రూపాయల నిధులతో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించినటువంటి కావలి శాసనసభ్యులు రామి రెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి-అనిత, మండల అధ్యక్షులు మేకల సుజాత, సీనియర్ నాయకులు టి పెంచలయ్య, మండల యువజన అధ్యక్షుడు మేకల శ్రీను, స్థానిక నాయకులు సాల్మన్ రాజ్, నాగేశ్వరరావు, పి ఉదయ్ కుమార్, సురేష్, వార్డు మెంబర్లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టిడ్కో గృహసముదాయాల ప్రారంభం

ప్రజాశక్తి-కావలి: రూ.161.11 కోట్లతో కావలి పట్టణం మద్దూరు పాడులో నిర్మించిన మొదటి విడత 2112 ఇళ్లను పేదలకు శుక్రవారం మంత్రి అందించనున్నారు. కావలి సమీపంలోని మద్దూరుపాడులో నిర్మించిన టిడ్కో గృహాలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ లబ్దిదారులకు అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి విడత సుమారు రూ.161.11 కోట్లతో నిర్మించిన 2112 గృహాలను అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చి పేదలకు అందజేస్తున్నారు. పూర్తిస్థాయిలో రోడ్లు, విద్యుత్, మంచినీటి సరఫరా, వాటర్ ట్యాంక్ నిర్మాణం, పార్క్, జిమ్ ఏర్పాటు, ఇళ్ల సముదాయం చుట్టూ ప్రహరీ గోడ మొదలైన అన్ని మౌలిక వసతులతో టిడ్కో ఇళ్లను అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు.

ఇంటర్ విద్యార్థులకు పలువురు అభినందనలు

అభినందిస్తున్న ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన సీనియర్ జూనియర్ ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల కీర్తిబావుటాను ఎగురవేశారు. సీనియర్ ఇంటర్ ఎం.పి.సి.విభాగంలో ఎన్. యశ్వంతి 989/1000మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలోను,కావలి పట్టణంలోను అత్యుత్తమ ర్యాంక్‌లో విజయం సాధించారు. ఆమెను కావలి ఎంఎల్‌ఏ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఘనంగా దుశ్శాలువా కప్పి, బొకే అందజేసి సత్కరించారు. కావలి కీర్తి ప్రతిష్టలు వినీలాకాశంలో నిలుపుతున్న శ్రీచైతన్యజూనియర్ కళాశాల విద్యార్థులను అభినందించారు.కళాశాలలో య ంపిసి విభాగంలో పి.దీప్తి 983/1000,ఇ. మేరి జోన్స్983/1000, ఏ.లక్ష్మీప్రసన్న 981, యం.వి.యన్.సుశీల్‌కుమార్ 981, బైపిసి విభాగంలో పి.విష్ణుసూర్యప్రకాష్ 971, కె.వెంకటసుశ్రిత 970, పి.అహ్మద్‌ఖాన్ 967, సి.ఇ.సి.విభాగంలో ఎస్.సౌజన్య 954, ఐ.యన్.వి.అనుషిత885, ఏ.దివ్య 885, హెచ్.ఆ.సి.విభాగంలో ఐ.సాహితీమాల 904మార్కులు సాధించారు. **జూనియర్ ఇంటర్** యంపిసి విభాగంలో ఇ.పూర్ణసన్నిసాయి 483 మార్కులు సాధించాడు. ఎస్‌కె.అఫ్తాబ్అహ్మద్ 456, డి.లక్ష్మిగణేష్456, ఎస్‌కె.మొబినా452, బైపిసి విభాగంలో కె.ప్రణీత్‌రాజ్‌వర్ధన్422, కె.నాగసాయి మల్లిక419, ఎస్.కె.సఫియా కౌసర్414 మార్కులు సాధించారు. సి.ఇ.సి.విభాగంలో ఓ.నాగేశ్వరి 400, సి.హెచ్.నవ్య394, యం.డి.అర్షియా 358 మార్కులతో కావలి పట్టణంలో విజయఢఘంకా మ్రోగించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను కళాశాల కరస్పాండెంట్, యాజమాన్యం, ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతరసిబ్బంది ఘనంగా అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కలిగిరి

మండలంలోని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ ఇంటర్‌లో 83 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 55శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఎంపీసీలో 'వడ్లమూడి సుస్మిత ' 974/1000 మార్కులు సాధించి మొదట స్థానంలో నిలువగా ' కె.ఆర్తి 951 ' భార్గవ్ 949 మార్కులు సాధించి రెండు మూడు స్థానాలలో నిలిచారు. సీనియర్ బైపిసి లో 'జి. వనజాక్షి ' 827 మార్కులు సాధించి మొదట స్థానంలో నిలువగా సీనియర్ . సిఇసిలో 'ఏ. ఆశ్రిత 748 ' మార్కులతో మొదట స్థానం లో నిలిచారు. జూనియర్ ఇంటర్ లో 81 మంది పరీక్షలు రాయగా 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో జూనియర్, ఎంపిసిలో పి. మధుప్రియ 438, జూనియర్ బైపిసి లో వి.త్రిపుర 403 ' మార్కులు , జూనియర్ సిఇసి లో ఏ. మాధురి 341 మార్కులు సాధించారు

మర్రిపాడు

ఇంటర్ ఫలితాలలోస్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. సీనియర్ ఇంటర్ ఓరుగంటి నందిని975/1000 మార్కులు సాధించి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మర్రిపాడు జూనియర్ కళాశాల విద్యార్థిని జిల్లా మొదటి ర్యాంకు సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ హనుమంతు రాజు తెలియజేశారు. సీనియర్ ఇంటర్ సిఇసిలో కె.వాణి

మర్రిపాడులో

840/1000 మార్కులతో, ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో పొదిలి ప్రవల్లిక 440/470 అధిక మార్కు లు సాధించి కాలేజీకిప్రతిష్ట తీసుకొచ్చారన్నారు.కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం77 శాతం, ప్రథమ సంవత్సరం 68 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా అత్యుత్తమ విద్యను అందిస్తున్నా మన్నారు. నందవరం ఆదర్శ పాఠశాలలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ ఫలితాల్లో 95.45శాతం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం77.27, ద్వితీయ సంవత్సరం77.5శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండవ సంవత్సరం విద్యార్థులు 82శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ ఎం.వాసు బాబు తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ గత రాత్రి విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థిని పుచ్చల ప్రసన్న అత్యధిక మార్కులు సాధించిందని తెలిపారు అదే క్రమంలో తొలి సంవత్సరం ఇంటర్మీడియట్ 57శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

"శ్రీశ్రీనివాస" విద్యార్థుల ప్రతిభ

కావలి

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో కావలి శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో అత్యధిక మార్కులు సాధించి విజయఢంకా మోగించారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఎం.శ్రియమణి 985మార్కులు సాధించింది. తేజశ్రీ 985, ఎన్.విష్ణుప్రియ984, మార్కులు సాధించారు. సి.ఇ.సి.విభాగంలో టాన్యాశ్రీ942 మార్కులు సాధించింది. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో పి.నాగసౌమ్య 459మార్కులు సాధించగా సి.ఇ.సి విభాగంలో యం.అనుజ 433మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచిందని కళాశాల కరస్పాండెంట్ బట్టేపాటి అశోక్‌కుమార్ తెలిపారు.

463, జి. జిగ్నేష్ 462, పి. శ్రీనవ్య 461, షేక్ సానియా కౌసర్ 460, జెవి. నాగ చతుర్య 460, కే. మానస 460, బైపీసి విభాగంలో టి. తేజస్విని 429, షేక్ దనీషా 423, ఎంఈసి విభాగంలో సి. చరణ్ ప్రీతి 449, సిఈసి విభాగంలో 398 సాధించి టాపర్స్ గా నిలిచారు. గురువారం కళాశాల లో విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కోట సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ అన్నీ విభాగాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం మాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ మొహమ్మద్ అల్తాఫ్, అకడమిక్ అడ్వయిజర్ డాక్టర్ యు.రామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

అల్లూరు

మండలంలోని నార్త్ మోపూరు శ్రీ చైతన్య ఆర్ట్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్పు సాధించినట్లు గురువారం ఆ కళాశాల కరస్పాండెంట్ శివకుమార్ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో ప్రథమ స్థానం స్నేహ 1000 /985 మార్కులు అలాగే ద్వితీయ స్థానం అనిత 971, తతీయ స్థానం పూజిత 965, తదుపరి స్థానాలలో వెంకటేష్ 963,

అల్లూరులో

మరోసారి సత్తా చాటిన శ్రీ వశిష్ట

కావలి శ్రీవశిష్టలో

కావలి

ఇంటర్మీడియట్ ఫలితాలలో కావలి పట్టణం పుల్లారెడ్డి నగర్‌లోని శ్రీ వశిష్ట జూనియర్ కాలేజీ మరో సారి సత్తా చాటింది. ఫస్టియర్, సెకండియర్ లలో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించి చరిత్ర సష్టించింది. సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఎస్. మేఘన 987, పి. లక్ష్మీ శ్రావణి 983, బైపీసి విభాగంలో లోక హితైషి 983, ఎంఈసి విభాగంలో కే. మహేంద్ర రెడ్డి 972, సిఈసి విభాగంలో జి. శ్రావణి 967 మార్కులు సాధించి టాపర్స్ గా నిలిచారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి లో ఎండి. మహిత లక్ష్మీ నిషిద 465, ఏ.వి.ఎస్. మహిత శ్రీ 464, పి. సాయిచరిత 464, పి. హర్షిత్ కుమార్ 464, సిహెచ్. లిఖిత ఇస్మాయిల్ 945, లహరి ప్రియ 942, యశ్వంత్ కుమార్ 933, శ్రీహిత 922, చాందిని 921, ఝాన్సీ 912, సుస్మిత 909, సాయి మేఘన 905, నందకిషోర్ 905, సింధు 902, దిరోష్ 900 అలాగే జూనియర్ ఇంటర్ లో 470/457 మార్కులు ప్రథమ స్థానం ఖాసిఫా ద్వితీయ స్థానం సువర్షిక 455 తతీయ స్థానం సఫియా 453 మిగతా విద్యార్థులు కావేరి 446, విజయ్ కుమార్ 441, సుమయ 440, తన్మయి 438, జీవన్ 432, యజ్ఞశ్రీ 430, విష్ణువర్ధన్ 420, పూజిత 418, పెనుగొండమ్మ 411, హర్షిత 409, సదియ సాజిద్ 407 మార్కులు సాధిం చారు. అనంతరం విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అమ్మవారికి కుందన నెక్లెస్ బహూకరణ

ప్రజాశక్తి-కొడవలూరు: బుచ్చిరెడ్డిపాలెం మండలం, జొన్నవాడలో వెలిసియున్న శ్రీ మల్లికార్జున కామాక్షితాయి సమేత అమ్మవారికి కుందన్ నెక్లెస్ బహూకరణ చేశారు. చెన్నయ్‌కు చెందిన నాయుడు కేశవరెడ్డి వారి దంప తులు రూ.16 లక్షల విలువ చేసే 275 గ్రాముల నెక్లెస్ బహూకరణ.దాతలకు స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించి ప్రత్యేకంగా పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలను ఆలయ చైర్మన్ పుట్ట సుబ్రహ్మణ్యం నాయుడు అందించారు.

జొన్నవాడలో మహాకుంభాభిషేకం

ప్రజాశక్తి-కొడవలూరు: బుచ్చిమండలం, జొన్నవాడ పుణ్యక్షేత్రంలో వెలిసి ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షి అమ్మవారి ఆలయం మహాకుంభాభిషేకం కార్యక్రమాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయని పాలక మండలి సభ్యులు ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు విలేఖరుల సమావేశంలో

తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంరోజుల పాటు జరిగే ఈ మహాకుంభాభిషేకం మహోత్స వంలో మొదటిరోజు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపూజ, గణనాథుని పూజ మొదటిగా నిర్వహించి యజ్ఞయాగాదులు మొదలెట్టారు. కార్యక్రమలకు దాతలుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, హైదబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కొలన్ రాజారెడ్డి, పూజిత దంపతులు వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. 27న గణపతి హోమం మొదలై 28న మహా సంకల్పం, అంకురార్పణ, 29న దేవతా కళాకర్షణం, 30న చండీ పారాయణ హోమం, మే 1న గణపతి పూజ, వారం రోజుల పాటు జరిగే కుంభాభిషేక వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పునీతులు కావాలని. కోరారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-కావలి: శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కావలి మండలం అల్లిగుంటపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 18 మంది రక్తదానం చేయగా, సుమారు 100 మందికి ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారి పేరూరి సాయితేజ మాట్లాడుతూ, అల్లిగుంట పాలెం గ్రామంలో నిర్వహిస్తున్న 7 రోజుల ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా 5వ రోజు రక్తం, రక్తదానం పై అవగాహన, రక్తదాన శిబిరం నిర్వహించమన్నారు. పలువురు గ్రామ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల డైరెక్టర్లు జానకిరామ్, వెంకయ్య, మల్లికార్జునరావు, కొండయ్య, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కాకాణికి వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి: మండల అభివృద్ధికి సహకరించాలని కొట్టాలపల్లి మాజీ సొసైటీ చైర్మన్ మూలే వినయ్ రెడ్డి మంత్రి కాకాణి వినతి పత్రం అందజేశారు. గురువారం నెల్లూరులోనీ మంత్రి కాకాణి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఉదయగిరి - బండగానిపల్లి ఘాట్ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉదయగిరి మాజీ వైసిపి మండల కన్వీనర్ మూలే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

ప్రజాశక్తి-ఉదయగిరి: వాలంటీరీలు తప్పనిసరిగా బయోమెట్ హాజరు వేయాలనిఎంపీడీఓ పి ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. గురు వారం స్థానిక బిట్- 2 పరిధిలోని సచివాలయంలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్స్ తప్పనిసరిగా బయోమెట్ హాజరు ఉదయం 10:30 లకు సచివాలయంలో వేయాలన్నారు. సర్వేలు 100శాతం పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు అందులో ఉండి వారికి సహకరిస్తూ సమస్యలు సచివాలయం దష్టికి తీసుకురావాలన్నారు. జగనన్న గహాలను త్వరలో నిర్మించుకునేలా లబ్ధిదారులకు వాలంటీర్స్ అవగాహన కల్పించాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖాదర్ కరిముల్లా, ప్రసన్న, మండల కోఆర్డినేటర్ షేక్ గాజుల ఇమ్రాన్, సచివాల సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

డాక్టర్ 'చిల్లకూరు'కు నివాళులు

ప్రజాశక్తి-కావలి: డాక్టర్ సి ఆర్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు అందించిన సేవలు అజరామరమని రెడ్ క్రాస్ చైర్మన్ డాకారపు రవిప్రకాష్ పేర్కొన్నారు. గురువారం ప్రముఖ రొటేరియన్, గూడూరు రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ చిల్లకూరు రాధాకష్ణారెడ్డి సంతాపసభ రెడ్,క్రాస్, భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలుగా జిల్లా పేద ప్రజలకు వైద్య సేవలందించిన డాక్టర్ చిల్లకూరురాధాకష్ణారెడ్డి గూడూరులో పలు విద్యాసంస్థలకు, మహిళా కళాశాలలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కావలి రెడ్‌క్రాస్, రక్తకేంద్రం వ్యవస్థాపకులు చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డికి సొంత తమ్ముడని, ఆయన లాగే రెడ్ క్రాస్, రోటరీ క్లబ్ ల ద్వారా ప్రజలకు సేవలందించారని వివరి ంచారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, దామిశెట్టి సుధీర్ నాయుడు, గంధం ప్రసన్న ఆంజనేయులు, కలికి శ్రీహరి రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బి.ఎస్.ప్రసాద్, జమున, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి: ఐసిడిఎస్ ప్రాజెక్ట పరిధిలోని బండగానిపల్లి పంచాయతీ బండగానపల్లి గ్రామ మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సచివాలయ సిబ్బంది ఆ పంచాయతీ సర్పంచ్ లక్కు.రమణమ్మ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లోని లబ్ధిదారులతో సచివాలయ అధికారులు మాట్లాడారు. లబ్ధిదారుల నమోదును పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న రిజిస్టర్లు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారుల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించారు.రిజిస్టర్‌లో ఉన్న వివరాలు కేంద్రంలో ఉన్న స్టాకు పరిశీలించి ఇదే విధంగా కొనసాగాలని మెను చార్ట్ గోడకు అతికించాలని సూచించారు.మినీ అంగన్వాడి కేంద్రం కావడం వల్ల అన్ని పనులు ఒకరే చూసుకోవాల్సి ఉంటుందని దానికి తగినట్లుగా కార్యాచరణ రూపొందించుకోవాలని తగు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ చినబాబు, డిజిటల్ అసిస్టెంట్ పవన్, మహిళా సంరక్షణ కార్యకర్త సాబియా, గుజ్జుల. సుబ్బరత్నమ్మ, బాలింతలు గర్భిణులున్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

అదనపు తరగతులకు భూమి పూజ

ప్రజాశక్తి-ఉదయగిరి: మనబడి నాడు- నేడు ఫేస్ -2 అదనపు తరగతులు నిర్మాణంకు భూమి పూజ చేసిన జెడ్పిటిసి మోడీ రామాంజనేయులు. గురువారం మండల పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల అప్పసముద్రం అదనపు తరగతి గదులు నిర్మాణం కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కలలో నెరవేరుస్తూ విద్యార్థుల భవిష్యత్తు దష్టిలో ఉంచుకొని చేపట్టిన కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు దీటుగా కార్పొరేట్ పాఠశాలలో కంటే మెరుగుగా ప్రభుత్వ పాఠశాలను రూపురేఖలు మార్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాలిరెడ్డి వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చేజర్ల సుధాకర్ రెడ్డి, ఉప చైర్మన్ డి.పద్మావతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ప్రజలకు అందించాల్సిన స్కీములు, సర్వీసులను అందించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను సాధించొచ్చునని ఆత్మకూరు ఎంపిపి కేత వేణు గోపాల్ రెడ్డి తెలియజేశారు. గురు వారం ఆయన మండలం లోని కరటం పాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి ఏ ఉద్దేశంతో సచివాలయం వ్యవస్థ ను ఏర్పాటు చేశారో సచివాలయం సిబ్బంది వాలంటీర్లు సహకారంతో ప్రభుత్వ పథకాలను, సర్వీసులు గ్రామ ప్రజలకు అందజేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను సాధించడానికి అందరూ కషి చేయాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ సి. శ్రీనివాసులు ప్రసంగిస్తూ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ప్రజలకు, నాయకులకు అందుబాటులో ఉండి సకాలంలో వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అలాగే తప్పనిసరిగా అందరూ సిబ్బంది, వాలంటీర్లు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని, అలాగే ఎక్కువ స్థాయి లో సర్వీసులను చేయాలని కోరారు. సమావేశంలో ఎంపిటిసి షేక్ ఖాసింసా, సచివాలయం కన్వీనర్ పట్టాన్ రఫీ, పంచాయతీ కార్యదర్శి అంకయ్య వి.అర్.ఒ ప్రతాప్ కుమార్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎఎస్ఐకు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-మర్రిపాడు: ఎస్పి కార్యాలయంలో జరిగిన క్రైమ్ మీటింగ్ లో తాను చేసిన సేవలకు గాను ఎస్పి తిరుమలేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మర్రిపాడు ఎఎస్ఐ కాసా శ్రీనివాసులు రెడ్డిగురువారం ప్రశంసా పత్రం అందుకున్నారు. ఇటీవల నెల్లూరు హాస్పిటల్ లో వైద్యం చేయించుకుని కడప జిల్లా ప్రొద్దుటూరు వెళుతూ మార్గమధ్యలో మండల కేంద్రం దగ్గరలో అనారోగ్యకారణ రీత్యా ఆసుపత్రికి వెళ్లి తిరిగి ప్రయాణంలో అకస్మాత్తుగా భార్య ఒడిలో తలవాల్చి చనిపోయిన వ్యక్తికి తానే దగ్గరుండి ఆ కుటుం బానికి అన్ని తానై మతదేహంను స్వయంగా సొంత ఖర్చులతో అంబులెన్స్ ఏర్పాటుచేసి మతుడి స్వగ్రామానికి తరలించి తన సేవా దక్పథాన్ని, మానవత్వాన్ని చాటు కోవడంపై పలువురి ప్రశంసలు అందు కున్నారు. ఆయన విధుల్లో ఉన్న సమయంలో వచ్చిన ప్రతి ఒక్కరితో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు శాయశక్తుల కషి చేస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అంటే ఇలానే ఉండాలని ప్రతి ఒక్కనోటా వినిపిస్తుందని మండల ప్రజలు అంటున్నారు.

రెండో కారుకు నీరు విడుదల

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని రెండో కారు (ఖరీఫ్) సాగు కోసం జలవనరుల శాఖ ఆదేశాల మేరకు 3వ నెంబర్ తూము వీటిని విడుదల చేశారు. పట్టణంలోని గురువారం చెరువు వద్ద మూడవ తూము వద్ద రైతులు . తొలి కారు పంట బాగా పనిచేయదని ధాన్యానికి కూడా ధర ఆశాజనకంగా ఉందని అదే ఉత్సవంతో రెండవ కారుకు సాగు చేసుకునేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ మేరకు మూడవ తూము కింద సుమారు 25 వేల ఎకరాలు పారుదల ఉంటుందని రైతులు తెలిపారు. సోమశిల ప్రాజెక్టు నాల్గవ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.వెంకటరమణారెడ్డి నీరు విడుదలకు రైతులతో మాట్లాడారు. సాగునీటిని వథా చేసుకోకుండా సమన్వయంతో రైతులు అందరూ కలిసి తమ పొలాలకు వారించుకోవాలని సూచించారు. దీంతో నార్లు పోసుకునేందుకు సిద్ధమైన రైతులు సాగునీరు విడుదల చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. నీరు విడుదల కార్యక్రమంలో రైతులు అల్లా రెడ్డి ఆనంద్ రెడ్డి, పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, రమేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



బీమ్‌రావ్ యశ్వంత్‌కు సన్మానం

ప్రజాశక్తి-కావలి: మండలం చలంచర్ల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని చలంచర్ల గ్రామంలో గురువారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నిలువెత్తు కాంస్య విగ్రహా ఆవిష్కరణకు డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మనవడు బీమ్ రావు యశ్వంత్ రావు విచ్చేశారు. ఆయనను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శాలువ కప్పి సత్కరిం చారు. అనంతరం ఎమ్మెల్యే పుష్ప గు చ్ఛాలు అందజేసి అభినం దనలు తెలిపారు. వారి వెంట వైసిపి నాయ కులు నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి జగదీశ్‌రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, పందిటి కామరాజు, ఆర్డిఒ శీనానాయక్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్స్ అయిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, కోవూరు గ్రామ కాపురస్తులు **1. యంపరాల బ్రహ్మారెడ్డి,** తండ్రి **పిచ్చిరెడ్డి, 2. యంపరాల కృష్ణారెడ్డి,** తండ్రి **పిచ్చిరెడ్డి** అను వారులు,

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కందుకూరు పట్టణ కాపురస్తులు అయిన **మందపాటి సుబ్బమ్మ** (లేట్) కు సంబంధించిన ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని, **మందపాటి సుబ్బమ్మ** వారసులు అయిన **మందపాటి మల్లిఖార్జున రావు, పెద్యాల పద్మావతి** అను వారలు విక్రయించదలచగా మా క్లయింట్స్ కొనుగోలు చేయుటకు సిద్ధపడియున్నారు. ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికి అయిన ఎటువంటి ఆక్షేపణలు ఉన్నయెడల మాకు **7 రోజులలోపల** తెలియ జేయగలరు. లేనియెడల ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎటువంటి తనకాలు గాని, అన్యాక్రాంతములు గాని ఉన్నయెడల చెల్లనేరవు.

షెడ్యూలు

పాత ప్రకాశం జిల్లా, ప్రస్తుతము శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, కందుకూరు మునిసిపాలిటీలో చేరిన కందుకూరు పట్టణం నందలి, పట్టా నెంబరు 745, సర్వే నెంబరు 275/2 లో విస్తీర్ణం య.0.59 సెంట్లున్నూ, పట్టా నెంబరు 993, సర్వే నెంబరు 275/102 విస్తీర్ణం య.0.47 సెంట్లున్నూ, రెండు నెంబర్లు కలిపి ఏక ప్రదేశం విస్తీర్ణం య.1-06 సెంట్లుకు సరియగు కందుకూరు పట్టణం 22 వ వార్డు, 2వ బ్లాకున్నూ, డోరు నెంబరు 22-2-6 ఇంటికి ఉత్తర ఈశాన్యముగా ఉన్న ఖాళీ స్థలముకు **హద్దులు:- తూర్పు:** కోవూరు రోడ్డు (ఈదిశ కొలతలు 34 అడుగులు), **దక్షిణం:** బేతిరెడ్డి శేషయ్య గారు విక్రయించి ఉన్న స్థలము, (ఈదిశ కొలతలు 105 1/5 అడుగులు), **పడమర:** బేతిరెడ్డి లక్ష్మమ్మ స్థలము, (ఈదిశ కొలతలు 34 అడుగులు), **ఉత్తరం:** ముప్పూరి వెంకటేశ్వర్లు వగైరాల వారి స్థలము, (ఈదిశ కొలతలు 106 1/5 అడుగులు) ఈ హద్దులలోని సదరు కొలతల ప్రకారం 3,600 చదరపు అడుగులు లేక 50 గదులు లేక 400 చదరపు గజములు లేక 334.453 చదరపు మీటర్లు గల ఖాళీ స్థలము. ఈ స్థమునకు తూర్పు హద్దుగా గల కోవూరు రోడ్డు లోనికి షెడ్యూలు ఆస్తిలో నుండి పోవు అన్ని రకములు అయిన రాకపోకలు జరుపుకొను హక్కులున్నూ, యావత్తు ఈజ్‌మెంటరీ వగైరా హక్కులతో సహా.

శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమందరావు
అడ్వకేట్స్, కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.